ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5 

తమిళనాడు
TAMILNADU

బుధవారం 5 ఫిబ్రవరి 2025

టీటీడీ ఆలయంలో రథసప్తమి వేడుకలు



టి.నగర్ టీటీడీ ఆలయంలో సూర్యప్రభవాహన సేవలో పాల్గొన్న స్థానిక సలహామండలి మాజీ అధ్యక్షుడు శ్రీకృష్ణ తదితరులు

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ శ్రీవారి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఉదయం సర్వాలంకరణశోభితులైన శ్రీవారు సూర్యప్రభ వాహనంలో భక్తులను అనుగ్రహించారు. ఈ వేడుకలలో టీటీడీ స్థానిక సలహామండలి మాజీ అధ్యక్షులు శ్రీకృష్ణ సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంగళవారం సాయంత్రం శ్రీవారు చంద్రప్రభ వాహనంలో దర్శనమిచ్చారు.



మంచు కారణంగా కనిపించని తాంబరం జాతీయ రహదారి

నగరాన్ని కప్పేసిన మంచు దుప్పటి

విమాన, రైలు సేవలకు అంతరాయం

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో, నగర శివారు ప్రాంతాల్లో మంగళవారం దట్టమైన మంచు అలముకోవడంతో విమాన, రైలు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్, చోళింగనల్లూరు, పెరుంబాక్కం, ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు, మేడవాక్కం, చిట్లపాక్కం, ఒట్టియంబాక్కం తదితర ప్రాంతాల్లో వేకువజాము ఐదు గంటల నుండే దట్టమైన మంచు దుప్పటిలా కప్పేసింది. దీంతో రోడ్లలో వెళుతున్న వాహనాలు కనిపించ వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చెంగల్పట్టు-చెన్నై బీచ్‌స్టేషన్ నడుమ లోకల్ విద్యుత్ రైళ్లు కూడా మంచు కారణంగా నత్తనడక నడిచాయి. పట్టాలు కనిపించకపోవడంతో ఆ మార్గంలో వెళ్లే రైళ్లన్నీ పావుగంట నుంచి అరగంట మేర ఆలస్యంగా గమ్యస్థానాలు చేరుకున్నాయి.

25 విమానసేవలకు అంతరాయం..

దట్టమైన మంచు కారణంగా మీనంబాక్కం ఎయిర్‌పోర్టులో 25కు పైగా విమాన సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. మంచు కారణంగా ఆరు విమానాలు ల్యాండింగ్ కాలేక బెంగళూరు, తిరువనంతపురం, హైదరాబాద్‌కు మళ్ళించారు. ఇక నగరం నుండి బయలుదేరాల్సిన 15కు పైగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. బుధవారం కూడా నగరంలో వేకువజామున దట్టమైన మంచు కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు.



మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్‌ను కమ్మేసిన మంచు



సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

బడుల్లో పర్యావరణ సంఘాలు

● ప్రకటించిన సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణంలో ఏర్పడుతున్న ప్రతికూల మార్పులపై, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడంపై అవగాహన కల్పించే దిశగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పర్యావరణ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో పర్యావరణం, వాతావరణ మార్పుల శాఖ ఆధ్వర్యంలో 'తమిళనాడు వాతావరణ మహోన్నత మహానాడు 3.0' పేరుతో మంగళవారం ఉదయం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడుతున్న ప్రతికూలా మార్పులపై తీవ్ర ఆందోళన చెందుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాతావరణంలో మార్పులపై అవగాహన కల్పించే కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తోందని, అకాల వర్షాలు, వరదలు వంటి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకుగాను తన నాయకత్వంలో వాతావరణ మార్పుల నిర్వాహక కమిటీ ఏర్పాటైందన్నారు. రాష్ట్రంలో వాతావరణంలో ఏర్పడుతున్న ప్రతికూల మార్పులపై పరిశోధించడంలో రాష్ట్రం అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉందన్నారు. వాతావరణ మార్పులపై మహోన్నతస్థాయి మహానాడు మొదటిసారిగా రాష్ట్రంలో నిర్వహించి పేరుతెచ్చుకున్నామన్నారు. ఈ మహానాడు సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పర్యావరణ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. అకాల వర్షాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగాఎదుర్కొనే దిశగా ఈ మహానాడులో నిపుణులు ప్రతిపాదన చేయనున్నారని స్టాలిన్ వెల్లడించారు. ఉష్ణోగ్రతలు అధికమయ్యే కారణంగా ప్రాణనష్టాలు జరుగుతుండటాన్ని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉపద్రవంగా పరిగణించి మరణించిన వారి కుటుంబాలకు రూ.4లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సులో మంత్రులు పొన్ముడి, తంగం తెన్నరసు, శాసనసభ్యుడు ప్రభాకర్‌రాజా, ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ సెంథిల్‌కుమార్, డైరెక్టర్ రాహుల్‌నాథ్ రాష్ట్ర పర్యావరణ మార్పులు, నిర్వహణ కమిటీ సభ్యులు ఎరిక్ జోల్‌హెయం, డాక్టర్ సౌమ్యా స్వామినాథన్, రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి అధ్యక్షురాలు జయంతి, అటవీ శాఖ ప్రధాన సంరక్షకులు శ్రీనివాస్‌రెడ్డి, మితా బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల ప్రారంభం...

రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూ.30.29 కోట్లతో కొనుగోలు చేసిన 147 అత్యవసర సేవల వాహనాలను ముఖ్యమంత్రి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో 108 అత్యవసర సర్వీసుకు సంబంధించి 72 అంబులెన్స్‌లు, గిరిజనులకు అత్యవసర వైద్య సేవల కోసం కొత్త సాంకేతిక వైద్య పరికరాలతో కూడిన నాలుగు వాహనాలు, 31 శవయాత్ర వాహనాలను కూడా ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు ఎం.సుబ్రమణ్యం, తంగం తెన్నరసు, పొన్ముడి, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సుప్రియా సాహు, ఆహార భద్రతా విభాగం శాఖ కమిషనర్ ఆర్ లాల్‌వేనా తదితరులు పాల్గొన్నారు.

'కలైంజర్ కరువూలం' వెబ్‌సైట్..

సచివాలయంలో సమాచార సాంకేతిక, డిజిటల్ సేవల శాఖ ఆధ్వర్యంలోని తమిళ అంతర్జాల విద్యా సంస్థ ద్వారా రూపొందించిన 'కలైంజర్ కరువూలం' ప్రత్యేక వెబ్‌సైట్ www.tamildigitallibrary,in/kalaignar ను ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సాహిత్య, పాత్రికేయ రచనలు, ప్రసంగాలు, సినిమాలు, నవలలు, కథానికలు, నాటకాలు తదితర విషయాలు తెలుసుకునేందుకు, చదివేందుకు వీలుంటుంది. ఈ కార్యక్రమంలో మంత్రి పళనివేల్ త్యాగరాజన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, తమిళఅంతర్జాల విద్యా సంస్థ డైరెక్టర్ ఎస్ఆర్.గాంధీ, డిప్యూటీ డైరెక్టర్ ఆర్ కోమగన్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం కరుణానిధి సాహిత్యాలతో కూడిన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న స్టాలిన్

ఎల్టీటీఈతో సంబంధాలున్నాయా?

● వైగో సహాయకుడిని విచారించిన క్యూ బ్రాంచ్

ప్యారీస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో నిషేధించిన శ్రీలంక ఉగ్రవాద సంస్థ ఎల్టీటీఈతో సంబంధాలున్నాయా? అని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో మాజీ సహాయకుడి వద్ద క్యూబ్రాంచ్ పోలీసులు విచారణ జరిపారు. వైగో వద్ద సహాయకుడిగా పనిచేస్తున్న ప్రసాద్ కేకేనగర్‌లో ఓ కంప్యూటర్ శిక్షణ కార్యాలయాన్ని నడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర క్యూబ్రాంచ్ పోలీసులు ప్రసాద్ నిర్వహిస్తున్న కంప్యూటర్ కార్యాలయానికి మంగళవారం వెళ్లి తనిఖీ చేశారు.ఆ సమయంలో ఎల్టీటీఈకి కంప్యూటర్ ద్వారా ఎలాంటి సహాయం అందించారని ప్రసాద్‌ను ప్రశ్నించారు. విచారణ అనంతరం ప్రసాద్ కార్యాలయం నుండి ల్యాప్టాప్, సెల్‌ఫోన్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకుని కార్యాలయానికి సీలు వేశారు. ఆన్‌లైన్ ద్వారా ప్రసాద్ ఎవరెవరిని సంప్రదించారు? అని విచారించారు. ఇదిలా ఉండగా కంప్యూటర్‌లో రకరకాలుగా ఎడిటింగ్ చేసి, ఎల్టీటీఈకి ప్రసాద్ సాయం చేసిన సమాచారం వెలుగులోకి వచ్చింది. కన్నియాకుమారి జిల్లా కళియకావిలై శ్రీలంక శరణార్థుల శిబిరంలో ఉన్న శ్రీలంక మహిళను గత నవంబరులో ప్రసాద్ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహానికి వైగో సహా రాష్ట్రానికి చెందిన పలు రాజకీయ నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ ఫొటో ఆధారంగా ప్రసాద్‌ను విచారణ పరిధిలోకి తీసుకొచ్చినట్లు సమాచారం. కాగా, ప్రసాద్ వాగ్మూలంలో ఎల్టీటీఈ ఉగ్రవాద సంస్థతో ఎంతమంది తమిళులకు సన్నిహిత సంబంధాలున్నాయన్న విషయం కూడా త్వరలోనే వెలుగులోకి వచ్చే అవకాశముంది.

● ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నిక

పోలింగ్‌కు సర్వం సిద్ధం

97 రకాల సామగ్రి తరలింపు ● ఐదంచెల భద్రత ఏర్పాటు



భారీ భద్రత నడుమ ఈవీఎంలను తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

ప్యారీస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నిక బుధవారం జరగనున్న సందర్భంగా పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నియోజకవర్గం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు 53 ప్రాంతాల్లో మొత్తం 237 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 1,10,127 మంది పురుషులు, 1,17,381 మంది మహిళలు 37 హిజ్రాలు మొత్తం 2,27,576 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఒకొక్క పోలింగ్ కేంద్రంలో ఒక ఈవీఎం, వీవీ ప్యాడ్, ఒక కంట్రోల్ పరికరం ఉపయోగించనున్నారు. బుధవారం ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్న సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో త్రాగునీరు, మరుగు దొడ్లు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా మెట్లు, షామియానాలు తదితర వసతులు కల్పించారు. అంతేకాక 8నుంచి 10పోలింగ్ కేంద్రాలకు ఒక జోనల్ అధికారి చొప్పున మొత్తం 24మంది జోనల్ అధికారులను నియమించి వారికి జీపీఎస్‌తో కూడిన వాహనాన్ని కూడా కేటాయించారు. ఈరోడ్ సీఎంసీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం ఈ వాహనాల్లో జోనల్ అధికారులు, సిబ్బంది, రిజర్వ్ పోలీసులు, పోలీసులు, ఈరోడ్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ కార్యాలయం స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచిన పోలింగ్ సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలను లారీలలో ఎక్కించి, భారీ పోలీసు బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఈరోడ్ ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజగోపాల సుంకర, రిటర్నింగ్ అధికారి శ్రీకాంత్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా పోలింగ్ కేంద్రాల్లో పనిచేసే అధికారులకు పోలింగ్‌రోజు వ్యవహరించాల్సిన తీరుపై రిటర్నింగ్ అధికారి మెలుకువలు నేర్పారు.

మాక్ పోలింగ్...

పోలింగ్ సిబ్బంది మంగళవారం రాత్రి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లోనే బసచేసి, బుధవారం ఉదయం 6గంటలకు అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఉదయం 7గంటల నుంచి ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 6గంటలకు ముగియనుంది. పోలింగ్ పూర్తయిన వెంటనే ఈవీఎం, వీవీ ప్యాడ్‌లను పోలీసు భద్రత నడుమ కౌటింగ్ జరిగే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలకు తరలిస్తారు. అధికార డీఎంకే, నామ్ తమిళర్ కట్చి సహా 46మంది ఇండిపెండెంట్లు ఈ ఉప ఎన్నికల బరిలో పోటీపడుతున్నారు.

182 టాస్మాక్ దుకాణాల మూసివేత...

ఉప ఎన్నిక నేపథ్యంలో ఈరోడ్ జిల్లాలోని 182 టాస్మాక్ మద్యం విక్రయ దుకాణాలు నాలుగురోజులు మూసివేయాలని జిల్లా కలెక్టర్ రాజగోపాల్ ఆదేశించారు. ఆ మేరకు 182 టాస్మాక్ దుకాణాల సహా బార్లు సోమవారం ఉదయం 10గంటల నుంచి మూసివేశారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు జరగనున్న 8వ తేదీ శనివారం కూడా మద్యం దుకాణాలు పనిచేయవు. ఇదిలా ఉండగా సెలవు ప్రకటించిన రోజుల్లో ఈరోడ్ జిల్లాలో మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించిన పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా గస్తీని ముమ్మరం చేసింది.

తిరుప్పరంకుండ్రంలో హై అలర్ట్



తిరుప్పరం కుండ్రం ఆలయ దారిలో విద్యార్థులను అనుమతిస్తున్న పోలీసులు

● బీజేపీ, హిందూమున్నాని కార్యకర్తల అరెస్టు
● గృహనిర్బంధంలో పలువురు నేతలు
● హైకోర్టు అనుమతితో సాగిన ప్రదర్శన

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుప్పరంకుండ్రం పర్వతాలయాన్ని ముస్లింలు కళంకపరిచారని, రామనాథపురం ఎంపీ నవాజ్‌ఘనీ, ఆయన అనుచరులు కొండపై మాంసాహారం తిన్నారని ఆరోపిస్తూ హిందూ మున్నాని, బీజేపీ శ్రేణులు మంగళవారం ఆ పర్వతాలయం వద్ద నిరసన ప్రదర్శనకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. మదురై, తేని, దిండుగల్, కన్నియాకుమారి, తిరుప్పూరు తదితర ప్రాంతాల నుండి తిరుప్పరంకుండ్రంకు బయలుదేరిన బీజేపీ, హిందూమున్నాని నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడే అరెస్టు చేశారు. పలువురు నేతలను గృహనిర్బంధం చేశారు. తిరుప్పరంకుండ్రంపై ఓ వైపు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం మరో వైపు సికిందర్ దర్గా ఉన్నాయి. హిందువులు, ముస్లింలు ఆ కొండపైకి రోజూ వెళ్ళి వస్తుండేవారు. ఇటీవల కొందరు ముస్లింలు కొండపైకి మేకపిల్లలను తీసుకెళ్ళి దర్గా వద్ద బలిచ్చేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకుని పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆ తర్వాత రామనాథపురం ఎంపీ నవాజ్‌ఘనీ కొండపైన ఉన్న దర్గాను సందర్శించారు. ఆ సందర్భంగా ఆయనతోపాటు వెళ్ళిన ఇద్దరు పార్టీ కార్యకర్తలు బిర్యానీ తిన్నారు. ఆ దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో రావడంతో హిందువుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించింది. ఆ పరిస్థితులలోనే తిరుప్పరంకుండ్రం క్షేత్రాన్ని కాపాడేందుకు ఈ నెల 4న నిరసన ప్రదర్శన చేస్తామని హిందూ మున్నాని నాయకులు ప్రకటించారు. తిరుప్పరం కుండ్రం పర్వతశిఖరాగ్రంపై దీపాన్ని వెలిగించాలని, ఆ పర్వతం మురుగప్పెరుమాన్‌కు సొంతమని దేవాదాయ శాఖ ప్రకటించాలనే డిమాండ్‌తో ఆందోళన చేపట్టనున్నట్లు హిందూ మున్నాని రాష్ట్ర అధ్యక్షుడు కాటేశ్వర సుబ్రమణియన్ ప్రకటించారు. అయితే పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ధర్నా చేస్తామని హిందూ మున్నాని నేతలు ప్రకటించడంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆందోళనకు బయలుదేరనున్న హిందూమున్నాని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటి నుంచి కదలకుండా పోలీసులు కట్టడి చేశారు. కృష్ణగిరి బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గోవిందరాజును పోచ్చంపల్లి సమీపం సెల్లంపట్టి వద్ద పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆయనతో పాటు 25 మంది బీజేపీ నాయకులు కూడా అరెస్టయ్యారు. మదురై, తేని, దిండుగల్ తదితర జిల్లాల నుండి కూడా బీజేపీ, హిందూ మున్నాని కార్యకర్తలు ఇళ్ల నుండి బయలుదేరుతుండగా వారిని అరెస్టు చేశారు.



తిరుప్పరం కుండ్రం పర్వతం వద్ద పోలీసు బందోబస్తు

ఇదే విధంగా పళని పర్వతాలయం వద్ద కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మదురై, తిరుప్పరం కుండ్రం ప్రాంతంలో మంగళవారం కూడా 144 సెక్షన్ అమలు చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే హిందూ మున్నాని, వీహెచ్‌పీ, బీజేపీ నేతలను తిరుప్పరంకుండ్రంలోకి ప్రవేశించకుండా పోలీసులు పలు చోట్ల బారికేడ్లు పెట్టి వాహనాల తనిఖీ కూడా జరిపారు. నాగర్‌కోవిల్ రైల్వేస్టేషన్ వద్ద కూడా పోలీసులను పెద్ద సంఖ్యలో మొహరించారు. కుళిత్తురై, నాంగునేరి, వళ్ళియూరు, రాజియల్ పోలీసుస్టేషన్‌ల వద్ద కూడా భద్రత పెంచారు. కన్నియాకుమారిలో వీహెచ్‌పీ, హిందూ మున్నాని నేతలు 12 మందిని అరెస్టు చేశారు. వీహెచ్‌పీ జిల్లా మహానగర అధ్యక్షుడు నాంజిల్ రాజాను వడచేరి పోలీసులు అరెస్టు చేశారు.

ఇదిలా ఉండగా హిందూ మున్నాని రాష్ట్ర విభాగం అధ్యక్షుడు కాటేశ్వర సుబ్రమణియం, ఆయన అనుచరులను తిరుప్పూరు పోలీసులు సోమవారం రాత్రి నుంచి గృహనిర్బంధంలో ఉంచారు.

హైకోర్టు అనుమతి...

తిరుప్పరం కుండ్రం సమీపం పళంగానత్తం ప్రాంతం వద్ద హిందూ మున్నాని ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించేందుకు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ అనుమతిచ్చింది. తిరుప్పరంకుండ్రం క్షేత్రాన్ని పరిరక్షించాలని కోరుతూ హిందూమున్నాని, వీహెచ్‌పీ, బీజేపీ నేతలు జరుపతలపెట్టిన ఆందోళనకు పోలీసులు అనుమతివ్వకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం మధ్యాహ్నం విచారణ జరిపిన హైకోర్టు తిరుప్పరం కుండ్రం సమీపం పళంగానత్తం వద్ద సాయంత్రం 5 నుండి 6 వరకు ధర్నా జరిపేందుకు అనుమతిస్తూ ఉత్తర్వు వెలువరించింది.

తరలివచ్చిన మురుగన్ భక్తులు

తిరుప్పరంకుండ్రం వివాదంపై హిందూమున్నని మంగళవారం సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ప్రదర్శన జరుపుకోవచ్చునని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులివ్వడంతో మురుగప్పెరుమాన్ భక్తులంతా మదురై నగరానికి పోటెత్తారు. హైకోర్టు ఆదేశం మేరకు మదురై సమీపంలో ఉన్న పళంగానత్తం వద్ద ధర్నా జరిపేందుకు సమీప జిల్లాల నుండి వేల సంఖ్యలో హిందూ మున్నాని కార్యకర్తలు, బీజేపీ, వీహెచ్‌పీ ప్రముఖులు తరలివచ్చారు. సాయంత్రం 5.15 గంటలకు 'తిరుప్పరం కుండ్రం మురుగప్పెరుమాన్‌కే చెందాలి. అన్యమతాలకు ఆ కొండపై చోటు లేదు' అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలలో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

సమాచార దర్శిని

రేపటి నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ శిబిరం

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారత సైనిక రంగంలో అభ్యర్థుల ఎంపిక శిబిరం ఈ నెల 6 నుంచి 9వ తేది వరకు కాంచీపురంలో జరుగనుంది. ఈ శిబిరంలో 12 జిల్లాలకు చెందిన అభ్యర్థులు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వస్వామి ఆలయ ఈ నెల పౌర్ణమి గిరి ప్రదక్షిణకు అనుకూల సమయాన్ని ఆలయ అధికారులు ప్రకటించారు. పౌర్ణమి రోజున అరుణాచలేశ్వరస్వామి ఆలయం వెనుక వైపున్న అన్నామలై కొండ చుట్టూ 14 కి.మీ గిరి ప్రదక్షిణ చేసేందుకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ ప్రకారం, ఈ నెల పౌర్ణమి ఘడియలు 11వ తేది సాయంత్రం 6.55 గంటలకు ప్రారంభమై 12వ తేది రాత్రి 7.22 వరకు కొనసాగనున్నాయని, ఈ ఘడియలు గిరి ప్రదక్షిణకు అనుకూలమని ఆలయ అధికారులు తెలిపారు.

23 నుంచి తిరుచ్చి-చెన్నై విమానసేవలు

● ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రకటన

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి-చెన్నై మధ్య ఈ నెల 23 నుంచి విమాన సేవలు ప్రారంభించనున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ తెలిపింది. తిరుచ్చి విమానాశ్రయం నుంచి దేశంలోని పలు నగరాలు, విదేశాలకు విమాన సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ విమానాశ్రయం నుంచి చెన్నై, బెంగళూరు, ముంబై, హైదరాబాద్ తదితర నగరాలకు ఇండిగో సంస్థ మాత్రమే విమానాలు నడుపుతోంది. ఈ నేపథ్యంలో, ఈ నెల 23వ తేది నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ తిరుచ్చి-చెన్నై-తిరుచ్చి విమాన సేవలు ప్రారంభించనుంది. ఆప్రకారం, చెన్నై నుంచి ఉదయం 6.45 గంటలకు బయల్దేరే విమానం రాత్రి 7.45 గంటలకు తిరుచ్చి చేరుకుంటుంది. మరుమార్గంలో రాత్రి 8.15 గంటలకు తిరుచ్చిలో బయల్దేరి 9.15గంటలకు చెన్నై చేరుకుంటుంది. ఇప్పటికే ఇండిగో సంస్థ తిరుచ్చి-చెన్నై మధ్య ఐదు సర్వీసులు నడుపుతుండగా, ఆరవ సర్వీసుగా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ విమానాలు నడుపనున్నట్లు ఆసంస్థ అధికారులు తెలిపారు.

20 పైసలు తగ్గిన కోడిగుడ్డు ధర

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ మండలంలో కోడి గుడ్డు ధర గత వారం పెరిగిన నేపథ్యంలో, ప్రస్తుతం 20 పైసలు తగ్గింది. ఆ ప్రకారం ఒక కోడిగుడ్డు ఫాం కొనుగోలు ధర రూ.5.05 నుంచి రూ.4.85కు తగ్గినట్లు మండల అధ్యక్షులు సింగరాజ్ తెలిపారు. ఇతర మండలాల్లో కోడి ధరలు తగ్గిన నేపథ్యంలో, నామక్కల్ మండలంలో కూడా ధర తగ్గించినట్లు ఆయన తెలిపారు.

వాహనాల్లో పశువుల తరలింపుపై నిబంధనలు

● ప్రకటించిన హైకోర్టు

ప్యారీస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పశువులను ఒకప్రాంతం నుండి మరొక ప్రాం తానికి వాహనాల్లో తరలించే సమయంలో పాటించాల్సిన నింబధనలను మద్రాస్ హైకోర్టు ప్రకటించింది. మంగళవారం హైకోర్టు జారీచేసిన ఉత్తర్వుల్లో వాహనాల్లో పశువులు నిలబడి ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రయాణం చేసేలా అవసరమైన స్థలం కేటాయించాలి. గాలి, నీరు, మేత తదితరాలను ఆ వాహనాల్లోనే సమకూర్చుకోవాలని పశు వుల యజమానులు, లోడువాహనాల యజమానులకు న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. ముఖ్యంగా పశువుల తరలింపుకు సంబంధించిన అనుమతి పత్రాలను వారి వెంటతీసుకెళ్లాలని సూచించింది.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు హాల్టులు

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు హాల్ట్ కల్పించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.12522 ఎర్నాకుళం-బరౌని రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7వ తేది నుంచి చీరాల స్టేషన్‌లో ఆగనుంది. నెం.16004 నాగర్‌సోల్-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్‌లోను, నెం.22101 లోకమాన్య తిలక్ టెర్మినస్-మదురై ఎక్స్‌ప్రెస్ గుత్తిలో, నెం. 11017 లోకమాన్య తిలక్-కారైక్కాల్ ఎక్స్‌ప్రెస్ గుత్తి, తాడిపత్రి, నెం.22669 ఎర్నాకుళం-పాట్నా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఖమ్మం, నెం.12656 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-అహ్మదాబాద్ నవజీవన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగనున్నాయి. అలాగే, నెం.12655 అహ్మదాబాద్- చెన్నై సెంట్రల్ నవజీవన్ ఎక్స్‌ప్రెస్, నెం.12611 సెంట్రల్-హజ్రత్ నిజాముద్దీన్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్, నెం.12603 చెన్నై సెంట్రల్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, నెం.17643 చెంగల్పట్టు-కాకినాడ పోర్ట్ సర్కార్ ఎక్స్‌ప్రెస్ మంగళగిరి, న్యూ గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని దక్షిణ రైల్వే తెలిపింది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు...

● నెం.22624/22623 మదురై-తాంబరం-మదురై సూపర్ ఫాస్ట్ రైళ్లకు ఈ నెల 6 నుంచి 20వ తేది వరకు అదనంగా రెండు ఏసీ త్రీ టైర్, రెండు జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అటవీ శాఖలో పోస్టుల భర్తీ

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) అటవీ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ)కి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఆ ప్రకారం, అటవీ శాఖలో ఖాళీగా ఉన్న 34 డ్రాఫ్ట్‌మెన్స్, 38 జూనియర్ డ్రాయింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి త్వరలో టీఎన్‌పీఎస్సీ చేపట్టనుంది.

తిరుచెందూరు నాళి కినరుకు మరమ్మతులు

● భక్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు క్షేత్రంలో సముద్రతీరానికి చేరువగా సుబ్రహ్మణ్యస్వామి శూలాయుధంతో తవ్విన పవిత్రమైన తీర్థపుబావిగా భావించే నాళి కినరు (ఊట బావి)కి మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో, భక్తులు పుణ్యస్నానమాచరించేందుకు ఆలయ నిర్వాహకులు ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ ఆలయానికి వచ్చే భక్తులు సముద్రతీరంలో స్నానాలు చేసిన అనంతరం నాళి కినరులో పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకున్న తర్వాతే స్వామివారి దర్శనం చేసుకుంటారు. అత్యంత ప్రాచీనమైన ఆ నాళి కినరుకు మరమ్మతులను ఆలయ అధికారులు ప్రారంభించారు. నాళి కినరు నుంచి మోటారు పంపు ద్వారా నీటిని వాటర్ ట్యాంక్‌లో పంపించి, ఆ ట్యాంక్ ద్వారా భక్తులను పుణ్యజలాలు అందిస్తున్నారు. సోమవారం నుంచి నాళి కినరును తాత్కాలికంగా మూసివేశామని, నీటి తొట్టిలో నుండి నాళికినరు జలాలను భక్తులు శిరస్సుపై చల్లుకోవాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేశారు.



ట్యాంక్ కొళాయి నుంచి వస్తున్న పవిత్ర జలాలను ఓ భక్తురాలికి అందిస్తున్న ఆలయ సిబ్బంది

పిడుగుల నిరోధానికి ఆధునిక పరికరం

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయ ప్రాంతంలో పిడుగుల నిరోధానికి అమెరిక సాంకేతిక పరిజ్ఞానంతో పరికరం ఏర్పాటుచేశారు. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. భక్తుల సౌకర్యార్థం ఆలయం, ప్రాంగణంలో రూ.300 కోట్లతో వసతుల కల్పన జరుగుతోంది. జూలైలో ఆలయ కుంభాభిషేకం నిర్వహించనున్నారు. అందుకోసం ఆలయ రాజగోపురంలో ఉన్న కలశాలు, ఆలయ లోపలి, బయట ప్రాకారాలు, భక్తుల విడిది గృహాలకు మరమ్మతులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, రాజగోపురంలోని కలశాలు రక్షించేలా ఇప్పటికే ఏర్పాటుచేసిన పిడుగుపాటు నిరోధక పరికరం తొలగించి, కొత్తగా రెండు పరికరాలు ఏర్పాటుచేశారు. గతంలో ఏర్పాటుచేసిన పరికరం ఇనుముతో తయారు చేయగా, కొత్తగా ఏర్పాటుచేసిన పరికరం రాగితో తయారుచేయించారు. కొద్దిరోజుల క్రితం కురిసిన భారీవర్షాలతో తంజావూరు బృహదీశ్వరాలయ రాజగోపురంపై పిడుగు పడి కలశం దెబ్బతిన్న ఘటన నెలకొంది. ఈ ఘటనపై అప్రమత్తమైన హిందూ దేవాదాయ శాఖ, రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆలయాల్లోని రాజగోపురాలపై అధునాతన పిడుగు నిరోధక పరికరాలు ఏర్పాటుచేయాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయమై దేవాదాయ శాఖ అధికారులు మాట్లాడుతూ.. 137 అడుగుల ఎత్తున్న రాజగోపురంలో కలశాలు ఏర్పాటుచేశామని, ఈ ప్రాంతంలో రెండువైపులా ఈ పరికరాలు అమర్చామన్నారు. 11 అడుగుల ఎత్తున్న ఈ పరికరం అమెరికా సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారని అధికారులు తెలిపారు.



తిరుచెందూర్ ఆలయ గోపురంపై ఏర్పాటుచేసిన పరికరం

నాయుడుపేటలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు హాల్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం-సికింద్రాబాద్-రామనాథపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నాయుడుపేటలో అదనపు హాల్ట్ కల్పించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.07695 సికింద్రాబాద్-రామనాథపురం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5వ తేది నుండి ఉదయం నాయుడుపేటకు ఉదయం 8.18 గంటలకు చేరుకొని 8.20 గంటలకు బయల్దేరుతుంది. మరుమార్గంలో నెం.07696 రామనాథపురం-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7వ తేది నుంచి అర్ధరాత్రి 12.03 గంటలకు చేరుకొని 12.05 గంటలకు బయల్దేరి వెళ్లనుంది.

పబ్లిక్ పరీక్షల పర్యవేక్షణకు 35 మంది నియామకం

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షల పర్యవేక్షణకు 35 మంది అధికారులను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ పబ్లిక్ పరీక్షలు సజావుగా జరిగేలా పాఠశాల విద్యాశాఖ అన్ని చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, పబ్లిక్ పరీక్షల పర్యవేక్షణకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు, పాఠశాల విద్యాశాఖలోని సీనియర్ డైరెక్టర్లు మొత్తం 35 మందిని నియమిస్తూ, వారికి కేటాయించిన జిల్లాల్లో పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

కేంద్ర కారాగారాల్లో కోళ్ల ఫారాలు


పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారాల్లో కోళ్ల ఫాంలు ఏర్పాటుకు జైళ్ల శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని జైళ్లలో ఉన్న ఖైదీలకు ప్రతి వారం కోడి కూరతో భోజనం పెడుతుంటారు. అందుకోసం, కేంద్ర కారాగారాల్లో 7 వారాల్లో ఉత్పత్తి అయ్యే కోళ్లు సంరక్షిస్తున్నారు. తొలివిడతగా వేలూరు జైల్లో కోళ్ల ఫారం ఏర్పాటైంది. ప్రజలకు కూడా కోడిమాంసం విక్రయించే చర్యలు చేపట్టనున్నట్లు జైళ్ల శాఖ అధికారులు తెలిపారు.



వేలూరు జైల్లో ఏర్పాటుచేసి కోళ్ల ఫారం

తిరుత్తణి మున్సిపాలిటీలో రహదారి విస్తరణ పనులు

తిరుత్తణి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో బైపాస్‌పై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రహదారుల శాఖ అధికారులు రోడ్డు విస్తరణ చేపట్టారు. హైవే విస్తరణలో భాగంగా రోడ్లకు ఇరువైపులా ఉండే చెట్లను తొలగించారు. ఇందులో సుమారు 30ఏళ్లకు పైబడిన చెట్లను కూడా అధికారులు తొలగించారు. దీనిపై అక్కడి స్థానికులు స్పందిస్తూ రోడ్డు మధ్యలో వున్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించకుండా కేవలం చెట్లను మాత్రమే నరికివేశారని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైన స్పందించి రోడ్లకు అడ్డుగావున్న పాత విద్యుత్ స్తంభాలను తీసివేయాలని అధికారులను అక్కడి ప్రజలు కోరుతున్నారు.



రోడ్లపై చెట్లను తొలగిస్తున్న దృశ్యం

రాష్ట్రపతి పాలన విధించండి

● మాజీ మంత్రి డి.జయకుమార్ డిమాండ్

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించేలా గవర్నర్ సిఫారసు చేయాలని మాజీ మంత్రి డి.జయకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, ఈ విషయాన్ని గవర్నర్ స్వయంగా చెబుతున్నారన్నారు. అలాంటి సమయంలో గవర్నర్ 356వ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించేలా ఎందుకు సిఫారసు చేయడం లేదని జయకుమార్ ప్రశ్నించారు.

పాత్రికేయుల సెల్‌ఫోన్లు అప్పగించండి: హైకోర్టు

ప్యారీస్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): అన్నా వర్శిటీ విద్యార్థిని అత్యాచారం కేసులో ఎఫ్ఐఆర్ లీకైన వ్యవహారంలో స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను పాత్రికేయులకు తిరిగి అప్పటించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. అన్నావర్శిటీ ప్రాంగణంలో ఓవిద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినవిషయంతెలిసిందే.ఈ కేసుపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందానికి చెందిన ఎఫ్ఐఆర్ లీక్ అవడంతో సంబంధిత మీడియా ప్రతినిధులను విచారిస్తున్నారు. విచారణకు హాజరయ్యే పాత్రికేయుల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో మద్రాస్ హైకోర్టులో మంగళవారం అన్నావర్శిటీ విద్యార్థిని కేసుపై విచారణ జరిపిన న్యాయమూర్తి ఎఫ్ఐఆర్ లీకైన వ్యవహారంలో ప్రాత్రికేయుల నుండి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లను తిరిగి అప్పగించాలని, విచారణ పేరుతో పాత్రికేయులను హింసించరాదని పోలీసు శాఖకు ఉత్తర్వులు జారీచేశారు. అదేసమయంలో విచారణకు పాత్రికేయులు పూర్తిస్థాయిలో సహకరించాలని న్యాయమూర్తి సూచించారు. ఎఫ్ఐఆర్ డౌన్‌లోడ్ చేసింది ఎవరు?, పాత్రికేయులకు మూడు సార్లు సమన్లు పంపించడం ఎందుకు?, ఈ వ్యవహారంలో పాత్రికేయుల వద్దే కాకుండా ఇతరుల వద్ద కూడా విచారణ జరిపారా, అయితే కోట్టూరుపురం పోలీస్ ఇన్స్పెక్టర్ వద్ద విచారణ జరిపారా?, ఆ వాగ్మూలం ఎక్కడా అని హైకోర్టు సంబంధిత పోలీసులను ప్రశ్నించింది.

తిరుత్తణి ఆలయంలో కలెక్టర్ పూజలు

తిరుత్తణి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన ఎం.ప్రతాప్ మంగళవారం సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. ఇప్పటి వరకు కలెక్టర్‌గా పనిచేసిన టి.ప్రభుశంకర్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌గా ఎం.ప్రతాప్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కలెక్టర్ ప్రతాప్ తిరుత్తణి ఆలయానికి కుటుంబ సభ్యులతో వెళ్లగా ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం కలెక్టర్ ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం తిరువళ్లూరు వెళ్లి కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు.



మురుగన్‌ను దర్శించుకుంటున్న కలెక్టర్ ప్రతాప్

రాష్ట్ర ప్రశాంతతకు భంగం కలిగించే యత్నం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలిగించేలా ఆర్ఎస్ఎస్, బీజేపీ యత్నిస్తున్నాయని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై ఆరోపించారు.ఈమేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... అవాస్తవాలు, వదంతులు, పుకార్లు రేకెత్తించి తద్వారా మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా వారి చర్యలున్నాయన్నారు.రాష్ట్ర సమైక్యతకు భంగం కలిగించే శక్తులను అణిచివేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి చర్యలకు పాల్పడేవారిని రాష్ట్ర ప్రజలు క్షమించరని అన్నారు. ఉత్తరాదిలో గందరగోళం, అల్లర్లు సృష్టించినవిధంగా,రాష్ట్రంలోనూవారు యత్నిస్తున్నారని సెల్వపెరుందగై ఆరోపించారు.

రేపటి నుంచి వేళచ్చేరి శ్మశానవాటిక మూసివేత

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండలం 172వ వార్డులో ఉన్న వేళచ్చేరి శ్మశానవాటికలో మరమ్మతుల కారణంగా బుధవారం నుంచి 25వ తేది వరకు మూసివేయనున్నారు. ఈ సమయంలో ప్రజలు ఆలందూర్ మండలం 163వ వార్డులోని బాలకృష్ణాపురం, అడయార్ మండలం 178వ వార్డులోని వేళచ్చేరి భారతి నగర్ శ్మశానవాటికలను వినియోగించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

లుఫ్తాన్సా విమానానికి బాంబు బెదిరింపు

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జర్మన్ నుంచి చెన్నై వచ్చిన లుఫ్తాన్సా విమానంలో బాంబు ఉందనే ఈమెయిల్‌తో ప్రయాణికులతో పాటు విమాన సిబ్బంది భయంతో వణికిపోయారు. మొత్తం 27 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఈ విమానం సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకోవాల్సి ఉంది. ఈ విమానం మరో గంటలో ల్యాండ్ అవుతుందనగా చెన్నై ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి చెన్నైకు వస్తున్న లుఫ్తాన్సా విమానంలో బాంబు పెట్టినట్టు పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన విమాన భద్రతా సిబ్బంది. బాంబు స్క్వాడ్.. విమానం ల్యాండ్ అయిన తర్వాత ప్రయాణికులను కిందకు దింపి క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ఎలాంటి బాంబు లేదని తేల్చారు. ఆ తర్వాత మంగళవారం వేకువజామున ఈ విమానం 265 మంది ప్రయాణికులతో రెండు గంటల ఆలస్యంగా జర్మనీకి బయలుదేరి వెళ్ళింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9నుండి మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌బోర్డు ఒకప్రకటనలో తెలిపింది.

అడయార్: ఎస్బీఐ కాలని, కర్పగం గార్డెన్, పద్మనాభ నగర్ 4,5 వీధులు, పరమేశ్వరి నగర్, జీవరత్నం నగర్, శాంతి కాలని, వెంకటేశ్వర నగర్, అరుణాచలపురం, రామస్వామి గార్డెన్, బీసెంట్ అవెన్యూ, అడయార్ బ్రిడ్జి రోడ్డు, ఆర్ఎస్ కౌంపౌండ్, ఎల్బీ రోడ్డు, బీసెంట్ నగర్ 1 నుండి 7 వీధులు, లక్ష్మీపురం, ఎమ్జీ రోడ్డు, శివగామి పురం, మాలవీయ అవెన్యూ, రాధాకృష్ణన్ నగర్, మరుందీశ్వరన్ నగర్, శ్రీరామ్ నగర్, అన్నా వీధి, ముత్తులక్ష్మీ వీధి, వాల్మీకి నగర్, ఆర్‌బీఐ కాలని, ఈస్ట్ మాధ వీధి, కళాక్షేత్ర రోడ్డు, వాల్మీకి వీధి, వేంబులిఅమ్మన్ ఆలయ వీధి, కుప్పం బీచ్, సీజీఈ కాలని, ఆర్ఎస్‌జీటీ కాలని, జయరామ్ వీధి, ఎల్బీ రోడ్డు, సుబ్రమణియం కాలని

వ్యాసర్పాడి: ఈహెచ్ రోడ్డు, బీవీ కాలని, శాస్త్రి నగర్, ఇందిరా నగర్, వ్యాసర్పాడి ఇండస్ట్రియల్ ఎస్టేట్, గాంధీ నగర్, స్టీఫెన్ రోడ్డు, వ్యాసర్ నగర్, పుదు నగర్, గాంధీ నగర్, ఎంపీఎం వీధి, వ్యాసర్పాడి మార్కెట్ వీధి, సెంట్రల్ క్రాస్ వీధి 10 నుండి 19, ఎంకేబీ నగర్ 1 నుండి 8 మెయిన్ రోడ్లు, ఎంకేబీ నగర్ 1 నుండి 6 క్రాస్ వీధులు, 10 నుంచి 19 ఈస్ట్ క్రాస్ వీధులు, ఎబీసీ కల్యాణపురం, సత్యమూర్తి నగర్ 1 నుండి 25 వీధులు, 42వ వీధి, సామాయార్‌తోట్టం 1 నుండి 4 వీధులు, పల్లా వీధి 1 నుండి 4, ఉదయ సూరియన్ నగర్

తిరువెల్లవాయల్: ఊరనంబేడు, కాట్టుపల్లి, నైతావాయల్, వోయలూరు, కాట్టూర్, తిరుప్పాలైవనం, కడపాక్కం, కానియంపాక్కం, చెంగలనీర్‌మేడు, రామనాధపురం, మీరట్టూరు, కల్పాక్కం, వెల్లంబాక్కం

కుండ్రత్తూర్: కుండ్రత్తూర్ మెయిన్ రోడ్డు, ఎమ్మెస్ నగర్, సెంథిల్ నగర్, బెల్ నగర్, జయేంద్ర సరస్వతి నగర్, అమ్మన్ నగర్, షణ్ముగ నగర్, జయలక్ష్మీ నగర్, ఆర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్, సత్యనారాయణపురం, పొన్నయమ్మన్ ఆలయ వీధి, విఘ్నేశ్వర నగర్ కొంత భాగం

ఇరుంబులియూర్: సెల్లయమ్మన్ ఆలయ వీధి, అరుళ్ నగర్, బాలాజి నగర్, రాజా తోట్టం, పొన్నన్ నగర్, తిరువళ్లువర్ వీధి, కేకే నగర్, ఏరికరై వీధి, శ్రీరామ్ నగర్, దేవనేశన్ నగర్, యమున వీధి, నర్మద వీధి, శాంతి నగర్

జీజీ నగర్: రత్నవేల్ పాండ్యన్ వీధి, ఈస్ట్ మొగప్పైర్ 2 నుంచి 5 బ్లాక్‌లు, ఓఆర్ఐ రోడ్డు, పుగళేంది రోడ్డు, నొలంబూర్ 1,6వ మెయిన్ రోడ్లు, దురగ అపార్ట్‌మెంట్, ఈఆర్ఐ స్కీమ్, 10వ వీధి, వీజీఎన్ ఫేస్-2, టీఆర్ఐ స్టార్ అపార్ట్‌మెంట్

కొవ్వూర్: ఇరండాంకట్టలై, మణికంఠన్ నగర్, మెహతా నగర్, మూండ్రాం కట్టలై, క్రైమా నగర్, సదానందంపురం, పుదువేడు, రెడ్డి వీధి, అన్నై థెరిస్సా నగర్, అబ్దుల్‌కాలం వీధి

పోరూర్: లక్ష్మి నగర్ 40 అడుగుల రోడ్డు, న్యూ కాలని, పిల్లయార్ ఆలయ వీధి, లక్ష్మి నగర్ అన్నా సాలై, మూర్తి అవెన్యూ, ట్రంక్ రోడ్డు.

● పరువునష్టం దావా కేసు..

టీఆర్ బాలుకు రూ.25లక్షల నష్టపరిహారం

● హైకోర్టు ఆదేశం

ప్యారీస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీ టీఆర్ బాలు పేరు ప్రతిష్ఠతలకు భంగం కలిగించేలా తప్పుడు వార్త ప్రచురించిన ఓ తమిళ వారపత్రిక యాజమాన్యం ఆయనకు రూ.25లక్షల నష్టపరిహారం చెల్లించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. 2012వ సంవత్సరం ఆ వారపత్రిక ప్రచురించిన వార్తలో సేతు సముద్ర పథకంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అవకతవకలకు పాల్పడ్డారని డీఎంకే కార్యవర్గ సమావేశంలో టీఆర్ బాలు మాట్లాడినట్లు తప్పుడు వార్త ప్రచురించారు. టీఆర్ బాలు ఆ పత్రికపై పరువు నష్టం దావా వేశారు. 2014 నుంచి జరుగుతున్న ఈ కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో, హైకోర్టు న్యాయమూర్తి ఏఏ నక్కీరన్ సమక్షంలో మంగళవారం విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా టీఆర్ బాలుకు రూ.25లక్షలు నష్ట పరిహారాన్ని చెల్లించాలని ఆ తమిళ వారపత్రిక యాజమాన్యానికి ఉత్తర్వులు జారీచేశారు.

ఎంఎం కాలనీ ఖాళీ చేయాలి

● హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై మాధవరం నియోజకవర్గ పరిధిలో ఆవిన్ పాల తయారీ కేంద్రం సమీపంలో ఉన్న ఎంఎం కాలనీని నాలుగు నెలల్లోగా ఖాళీ చేయాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ సంస్థ (సీఎంఆర్ఎల్) ఉత్తర చెన్నై ప్రాంతంలో కొత్తగా మెట్రోరైలు పనులు ప్రారంభించింది. మాధవరం ఆవిన్ పాల కేంద్రం సమీపంలో చేపట్టనున్న మెట్రో పథకం పనుల నిమిత్తం ఆ ప్రాంతంలో ఉన్న ఎంఎం కాలనీ ఖాళీ చేయాల్సిందిగా రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తూ ముగ్గురు స్థానికులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం వచ్చే మే31వ తేదీలోగా ఎంఎం కాలనీని ఖాళీ చేయకుంటే ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

రోడ్డుపై మొసలి సంచారం

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిర్ రోడ్డుపై మొసలి నడిచి వెళ్లడంతో చుట్టుపక్కల ప్రజలు హడలుతున్నారు. చిదంబరం సమీపం కూడువెలిచావిడి గ్రామ సమీపంలోని కొలను నుంచి బయటకు వచ్చిన మొసలి కాట్టుమన్నార్‌కోయిల్ రోడ్డు దాటి వెళ్తుండడాన్ని గమనించిన వాహన చోదకులు, ఆ దృశ్యాలు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మొసలి సంచారంతో భీతిల్లుతున్న ఆ ప్రాంత ప్రజలు, మొసలిని బంధించి తగిన ప్రాంతంలో విడిచిపెట్టాలని అటవీ శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.



రోడ్డుపై వెళ్తున్న మొసలి

లంచం కేసులో ఎస్ఐకి ఐదేళ్ల జైలు

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుడి నుంచి రూ.1,500 లంచం ఆశించిన ఎస్ఐకి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ చెన్నై ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. వాషర్‌మెన్‌పేట కళింగరాయన్ వీధికి చెందిన ప్రేమ్‌కుమార్ చెన్నై కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రేమ్‌కుమార్ అదే ప్రాంతానికి చెందిన సెల్వం వద్ద 2007లో రూ.10వేలు అప్పుగా తీసుకున్నాడు. అందుకు నెలకు రూ.1,000 చొప్పున 18 నెలలు చెల్లించాడు. అదనంగా మరో రూ.8,000 చెల్లించిన తర్వాత కూడా, సెల్వం అసలు ఇవ్వాలని అడగడంతో ప్రేమ్‌కుమార్ నిర్ఘాంతపోయాడు. తాను అందజేసిన అప్పు ప్రేమ్‌కుమార్ తిరిగి అప్పగించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ సెల్వం వాషర్‌మెన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ప్రత్యేక ఎస్ఐ జయకుమార్ విచారణ జరిపి ప్రేమ్‌కుమార్ నుంచి రూ.10వేలు వసూలుచేసి సెల్వంకు అందజేశాడు. అప్పుకు సంబంధించిన పత్రాలను సెల్వం ప్రత్యేక ఎస్ఐకు అందజేశాడు. ఆ పత్రాలు ఇవ్వాలంటే రూ.1,500 లంచం ఇవ్వాలని ఎస్ఐ డిమాండ్ చేశాడు. దీంతో, ప్రేమ్‌కుమార్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారుల సూచన తో 2011 ఫిబ్రవరి 4వ తేది ఎస్ఐకి ప్రేమ్‌కుమార్ లంచం ఇస్తున్న సమయంలో అక్కడే మాటువేసిన అధికారులు, అతడిని పట్టుకున్నారు. ఈ కేసు వాదోపవాదాలు పూర్తికావడంతో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి, ఎస్ఐ జయకుమార్‌కు ఐదేళ్ల జైలు, రూ. లక్ష జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు.

భర్త బతికుండగానే డెత్ సర్టిఫికెట్ !

● మహిళ అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బతికున్న భర్త పేరుతో డెత్ సర్టిఫికెట్ పొందేందుకు యత్నించిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. సేలం జిల్లా ఎడప్పాడిలో భర్తకు చెందిన ఆస్తులు చేజిక్కించుకొనేందుకు, గుర్తుతెలియని మృతదేహాన్ని చూపించి, భర్త చనిపోయినట్లు నాటకమాడిన మహిళ, డెత్ సర్టిఫికెట్ తీసుకొనే సమయంలో పోలీసులకు చిక్కింది. రేవతి అనే ఆ మహిళ భర్త విజయకుమార్ విదేశాల్లో పదేళ్ల ఉద్యోగం చేసి జూన్‌లో స్వగ్రామానికి తిరిగొచ్చాడు. విజయకుమార్ వచ్చిన రోజు నుంచే అతడితో గొడవ పడుతున్న రేవతి, భోజనంలో విషం కలిపి చంపుతానని బెదిరించి అతనిని ఇంటి నుంచి వెళ్లగొట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో, డెత్ సర్టిఫికెట్ విచారణకు రెవెన్యూ శాఖ అధికారులు రేవతి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో విజయకుమార్ బతికే ఉన్నట్లు చుట్టుపక్కల వారి ద్వారా అధికారులు తెలుసుకున్నారు. భర్తని కావాలని ఇంటి నుంచి తరిమేసిన రేవతి, అతను కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం భవాని నదిలో కొట్టుకొచ్చిన గుర్తుతెలియని మృతదేహాన్ని తన భర్తదే అంటూ, పోస్టుమార్టం రిపోర్ట్ వరకు అందర్నీ నమ్మించినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. రేవతికి మరొకరితో వివాహేతర సంబంధం ఉందని, అందువల్ల తనను బెదిరిస్తున్నట్లు విజయకుమార్ పోలీసులకు తెలిపాడు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి పోలీసులు రేవతిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.



రేవతి

సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

● ఒకరికి గాయాలు

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా మారంహళ్ళి సమీపం సీరియంపట్టి గ్రామంలో మంగళవారం ఉదయం వంట గ్యాస్ సిలిండర్ పేలి ఓ ఇల్లు ధ్వంసమైంది. ఈ సంఘటనలో జేసీబీ ఆపరేటర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఉత్తరాది రాష్ట్రంలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మాదేశన్ (52) సీరియంపట్టిలో నివశిస్తున్నారు. అతడికి ఇద్దరు కుమారులు. తరచూ ఆయన ఉత్తరాది రాష్ట్రానికి వెళ్ళి వస్తుంటాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన మాదేశన్ మంగళవారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ దుర్ఘటనలో ఆ ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. ఆ ఇంటి పక్కనే ఉన్న మరో ఇల్లు కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ధ్వంసమైన ఇల్లు

ఐదు కార్పొరేషన్ బస్టాండ్ల పునరుద్ధరణ

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదు కార్పొరేషన్ బస్టాండ్లు పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం రూ.2 కోట్లతో సమగ్ర ప్రణాళిక తయారుచేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.. ఆ ప్రకారం, నామక్కల్, తిరుచ్చి, ఈరోడ్, హోసూరు, తిరువణ్ణామలైలలో ఉన్న పాత కార్పొరేషన్ బస్టాండ్లు పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వేంగైవయల్ వెళ్లేందుకు అనుమతించాలంటూ పిటిషన్

● పోలీసు శాఖకు హైకోర్టు నోటీసు

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వేంగైవయల్ వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ పుదుకోటకు చెందిన న్యాయవాది మలర్ మన్నన్ దాఖలుచేసిన పిటిషన్‌పై పోలీసు శాఖ అఫిడివిట్ దాఖలుచేయాలని హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. పిటిషనర్ సంబంధిత నేరస్తుల తరపున వకాల్తా పుచ్చుకున్నాడా? అనే న్యాయమూర్తి ప్రశ్నించారు. వేంగైవయల్ ఎవరిని కలిసేందుకు వెళుతున్నారు? వారికి సాయం చేసేందుకు చట్టపనుల విభాగం ఉంది కదా అంటూ న్యాయమూర్తి ప్రశ్నలు లేవనెత్తారు. అదే సమయంలో వేంగైవయల్ వెళ్లేందుకు అనుమతులివ్వని హైకోర్టు, ఈ పిటిషన్‌పై జిల్లా పోలీసు శాఖ అఫిడివిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసింది.

కడలూరు దారిలో ఎముకలు

● భీతిల్లిన ప్రజలు

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడలూరు మంజకుప్ప నేతాజీ రోడ్డు పక్కగా మనిషి ఎముకలు, నిమ్మపండ్లు, పసుపు, కుంకుమ పడి ఉండటం చూసి స్థానికులు భీతిల్లారు. మంగళవారం ఉదయం ఆ రహదారి వద్ద పారిశుద్ధ్యకార్మికులు శుభ్రం చేస్తుండగా ఓ చోట మనిషి ఎముకలను చూసి దిగ్భ్రాంతి చెందారు. వెంటనే ఆ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడలూరు పుదునగర్ ఎస్ఐ ప్రసన్నా ఇతర పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదైన వీడియో దృశ్యాల ద్వారా ఆ ఎముకలను అక్కడ వేసిన వారికోసం గాలిస్తున్నారు.



పోరూర్‌లో రూ.15 కోట్లతో తర్పణాలకు హాలు



అధునాతన వసతులతో నిర్మించిన తర్పణం హాలు

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా పోరూర్‌లో రూ.15 కోట్లతో నిర్మించిన తర్పణం హాలును బుధవారం దేవాదాయ శాఖకు అప్పగించనున్నారు. పోరూర్ పడితురైలో పోరూర్ పట్టీశ్వరాలయం స్థలంలో ఎన్నో ఏళ్లుగా పితృదేవతలకు తర్పణాలు పెడుతుంటారు. ఈ ప్రాంతం దిగువన ఉండడంతో నొయ్యల్ నదిలో వరదలు ఏర్పడే సమయంలో, తర్పణాలు వదిలే స్థలం పూర్తిగా మునుగుతోంది. ఈ క్రమంలో, నల్లరం ట్రస్ట్ ఆధ్వర్యంలో పడితురైలో దేవాదాయ శాఖకు చెందిన స్థలంలో కొత్తగా తర్పణం హాలు నిర్మాణాలకు 2020 జూన్ 5న భూమి పూజ జరిగింది. రూ.15 కోట్లతో చేపట్టిన పనులు ప్రస్తుతం పూర్తయ్యాయి. ఒకేసారి 100 మంది కూర్చొనేలా 50 తర్పణ మండపాలు, 500 మంది కూర్చొనేలా వెయిటింగ్ హాల్, పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా అధునాతన టాయిలెట్లు ఏర్పాటుచేశారు. అలాగే, ఒకే సమయంలో 100 కార్లు, 250 బైక్‌ల పార్కింగ్ సదుపాయం, 27 నక్షత్రాల పేరుతో 27 చెట్లతో ఉద్యానవనం ఏర్పాటుచేశారు. ప్రత్యేక నవగ్రహ స్తంభాలు, వైద్య సదుపాయం, పోలీసు, అగ్నిమాపక శాఖలకు ప్రత్యేక గదులు, 45వేల అడుగుల విస్తీర్ణంలో గ్రావెల్ వాకింగ్ వే తదితరాలు ఏర్పాటుచేశారు. ఈ అధునాతన తర్పణం హాలును ట్రస్ట్ నిర్వాహకులు, బుధవారం పోరూర్ పట్టీశ్వరర్ ఆలయ నిర్వాహకులకు అప్పగించనున్నారు.

సెంగాడు పంచాయతీ అధ్యక్షుడికి 'పర్యావరణ ప్రేమికుడు' పురస్కారం



దేవేంద్రన్‌కు పురస్కారం అందిస్తున్న అరుణ్, కన్నన్ తదితరులు

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న రాణిపేట జిల్లా సెంగాడు పంచాయతి అధ్యక్షుడు టి.దేవేంద్రన్‌కు 'పర్యావరణ ప్రేమికుడు' పురస్కారం ప్రదానం చేశారు. ఆయనను పసుమై తాయగం రాష్ట్ర కార్యదర్శి అరుణ్ ఈ పురస్కారాన్ని అందజేశారు. పురస్కార గ్రహీతను పసుమై తాయగం రాష్ట్ర నిర్వాహకులు ఎస్.కన్నన్, కె.పొన్‌మలై, ఎం.అశోక్ తదితరులు అభినందించారు.

ఆక్టోపస్ కాదు...ముల్లంగి...!



పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యత్యాసంగా ఉన్న ముల్లంగిని అటు వ్యాపారులు, ఇటు ప్రజలు ఆసక్తిగా చూశారు. దిండుగల్ జిల్లా పళని రైతు బజార్‌కు రైతు మురుగేశన్ ముల్లంగిని విక్రయానికి తీసుకొచ్చాడు. వాటిలో ఓ ముల్లంగి చూసేందుకు సముద్రంలో కనిపించే ఆక్టోపస్‌లా ఉంది. పిల్లలు, పెద్దలు ఈ ముల్లంగిని పట్టుకొని సెల్ఫీ తీసుకోగా, ఓ వినియోగదారులు అధిక ధరకు కొనుగోలు చేశాడు.

టీవీకేలో ఆటో డ్రైవర్‌కు వరించిన పదవి



టీవీకే జిల్లా కార్యదర్శిగా నియమితుడైన ఆటో డ్రైవర్ బాబును సత్కరిస్తున్న పార్టీ మహిళా కార్యకర్తలు

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగంలో కోయంబత్తూరు సూలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న కోయంబత్తూరు సబర్బన్ ఈస్ట్ జిల్లా కార్యదర్శిగా బాబు అనే ఆటో డ్రైవర్‌ను నియమించారు. విజయ్ వీరాభిమాని అయిన బాబు తనకు పార్టీలో కీలకమైన పదవి ఇచ్చినందుకు ఉబ్బితబ్బిబ్బైపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన స్నేహితులు, పార్టీ మహిళా కార్యకర్తలు ఆయనను సత్కరించారు. ఆటో డ్రైవర్ బాబు మాట్లాడుతూ తాను విజయ్ అభిమాన సంఘం, విజయ్ మక్కల్ ఇయక్కమ్‌లో క్రియాశీల కార్యకర్తగా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనేవాడినని, పార్టీ ప్రారంభించిన తర్వాత కూడా సాధారణ కార్యకర్తగానే కొనసాగాలని నిర్ణయించుకున్నానని, ఈ పరిస్థితుల్లో పార్టీ నేత విజయ్ తనకు జిల్లా శాఖ కార్యదర్శి పదవినివ్వడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.

మాస్కో పర్యటనకు భారతీయులకు అవకాశం

● థామస్ కుక్ ఇండియా ప్రకటన



ప్యారీస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారతీయులు మాస్కోలో పర్యటించేందుకు అవకాశం వచ్చిందని థామస్ కుక్ ఇండియా చైర్మెన్ రాజీవ్ కాలే పేర్కొన్నారు. ఆళ్వార్‌పేటలోని రష్యన్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాస్కో నగర పర్యాటక కమిటీ చైర్మెన్ ఎవ్జెనీ క్లోజో, థామస్‌కుక్ ఇండియా చైర్మెన్ రాజీవ్ కాలే టూర్ ఆపరేటర్ పథకానికి సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మాస్కో ప్రతినిధులు మాట్లాడుతూ భారత పర్యాటకులకు అనుగుణంగా కొత్త అంశాలను వృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ ఒప్పందాలు జరిగినట్లు వారు తెలిపారు. అనంతరం రాజీవ్ కాలే మాట్లాడుతూ భారతీయ టూర్ ఆపరేటర్ రానున్న సీజన్‌లో ఆసక్తి కలిగిన భారతీయులను మాస్కోకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్కో ప్రతినిధులు మాయా అనురోవా, నటాలియా, వోస్కానాంట్స్ అనస్తాసియా, సృజన పెరీరా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగంలో రథోత్సవం

● సింహ వాహనంలో ఊరేగింపు

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో తైతేర్ వేడుకలు మంగళవారం జరిగాయి. దీనిని పురస్కరించుకుని రథోత్సవం నిర్వహించగా, స్వామివారు సింహ వాహనంలో ఊరేగారు. ఈ ఆలయంలో భూపతి తిరునాళ్‌గా పిలిచే తైతేర్ తిరువిళా మూడు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో భాగంగా, మంగళవారం వేకువజామున 3.45 గంటలకు నమ్ పెరుమాళ్‌ను అద్దాల గది నుంచి వాహన మండపానికి తీసుకెళ్లారు. ఆ తర్వాత 4.45 గంటలకు సింహ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం 6.30 గంటలకు గజ వాహనంలో ఊరేగిన తర్వాత రాత్రి 9.15 గంటలకు తిరిగి అద్దాల గదికి చేరుకుంటారు. ఈ వేడుకలు ఈ నెల 11వ తేదీతో ముగుస్తాయి.

పార్థసారథి ఆలయంలో వైభవంగా రథసప్తమి వేడుకలు





సూర్యప్రభ వాహనంలో ఊరేగుతున్న పార్థసారథి స్వామి - ఊరేగింపులో వైష్ణవ పండితులు

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం ట్రిప్లికేన్ పార్థసారథి స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి, ఉత్సవమూర్తి వేంకటనాథుడిని పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించి ఆలయ ముఖమంటపంలో కొలువుదీర్చారు. ఆ తరువాత సూర్య ప్రభ వాహనంపై స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు.. ఈ సందర్భంగా వైష్ణవ పండితులు ఊరేగింపులో పాల్గొని స్వామివారిని కీర్తిస్తూ, భజన పాటలు ఆలపించారు.

ఎంసీసీలో శాటిలైట్ తయారీపై వర్క్‌షాప్



చిన్న ఉపగ్రహాలు తయారుచేసిన విద్యార్థులు

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెట్‌పెట్‌లోని మద్రాసు క్రిస్టియన్ కాలేజ్ హైయ్యర్ సెకండరీ స్కూలు ప్రాంగణంలో ఉప గ్రహాల తయారీపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. స్కూల్ సైన్స్ క్లబ్, సేలం వింగ్స్ ఆఫ్ సైన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు జి.జబదాస్ దినకరన్, వింగ్స్ ఆఫ్ సైన్స్ అకాడమీ నిర్వాహకులు అరవింద్, షణ్ముగరాజా తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా తరమణిలోని సీఎస్ఐఆర్ మద్రాసు క్యాంపస్ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.జీఎస్ అయ్యప్పన్ పాల్గొని, ఉపగ్రహాల తయారీ, వాటిని ఆకాశంలోకి పంపడం, ఉపగ్రహాల ప్రాముఖ్యత తదితరాలపై వివరించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన 10 ఉపగ్రహాలను 'వెదర్ బెలూన్' ద్వారా 300 అడుగుల ఎత్తుకు పంపించారు. వీటి ద్వారా పాఠశాల ప్రాంగణంలోని ఉష్ణోగ్రత, గాలిలో తేమ, గాలి వేగం సహా పలు విషయాలను ఉపగ్రహాలు కంట్రోల్ సెంటర్‌కు పంపించాయి. విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయులు జబదాస్ దినకరన్ తెలిపారు.



ఎన్‌సీసీ క్యాడెట్లకు బహుమతులు అందజేస్తున్న ఉదయనిధి

సీమాన్ వ్యాఖ్యలు పట్టించుకోను

● డిప్యూటీ సీఎం ఉదయనిధి

ప్యారీస్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పరిజ్ఞానం లేని నామ్ తమిళర్ కట్చి ఆర్గనైజర్ సీమాన్ వ్యాఖ్యలను పట్టించుకోబోనని డిప్యూటీ సీఎం ఉదయనిధి మరోమారు స్పష్టం చేశారు. అన్నాసాలైలోని కలైవానర్ ఆరంగంలో గణతంత్ర వేడుకల సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్ల అభినందన సభలో డిప్యూటీ సీఎం ఉదయనిధి పాల్గొని వారికి ధ్రువీకరణపత్రం, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తందైపెరియార్ గురించి సీమాన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఖండించదగ్గదని, అలాంటి వ్యాఖ్యలకు తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

హిందూ కాలేజీలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టాభిరామ్‌లోని డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాలలో మంగళవారం క్యాన్సర్‌పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించింది. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, జెండర్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో డాక్టర్ ఫర్ యూ యూ అనే సంస్థకు చెందిన డాక్టర్ కెర్నాఫ్ లూయిసా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ, ఇటీవలి కాలంలో క్యాన్సర్ రావడానికి ప్రస్తుత జీవన, ఆహారపు అలవాట్లే దీనికి కారణమన్నారు. అందువల్ల మహిళలు క్రమం తప్పకుండా ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రధాన అధ్యాపకులు డాక్టర్ కల్విక్కరసి, సంచాలకుడు డాక్టర్ ఎస్.రాజేంద్ర నాయుడు అతిథులను సత్కరించారు. ఆ తర్వాత విద్యార్థులు, మహిళలతో బోధన, బోధనేతర సిబ్బందికి వైద్యులు ప్రాథమిక పరీక్షలు చేసి తగిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ప్రజ్ఞానందకు ఘన స్వాగతం



విమానాశ్రయం వద్ద ట్రోఫీని ప్రదర్శిస్తున్న గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో విజేతగా నిలిచిన ప్రజ్ఞానంద మంగళవారం నగరానికి రాగా, ఆయనకు చెన్నై ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. ఈ పోటీల్లో తన ప్రత్యర్థి గుకేష్‌ను టై బేకర్‌లో చిత్తు చేసి వరల్డ్ చెస్ విజేతగా నిలిచారు. ఈ పోటీల్లో తొలి 12 రౌండ్లు ముగిసే సమయానికి ప్రజ్ఞానంద కేవలం ఒకే ఒక్క పాయింట్ సాధించి ముందంజలో ఉన్నారు. ఆ తర్వాత 13, చివరి రౌండ్‌లో గుకేష్ ఒక పాయింట్ సాధించాడు. ఫలితంగా ఈ ఇద్దరు సమ ఉజ్జీలుగా నిలిచారు. దీంతో విజేతను తేల్చేందుకు ట్రైబ్రేకర్ నిర్వహించగా, ఇందులో గుకేష్‌ను ప్రజ్ఞానంద చిత్తుచేశాడు. ఫలితంగా టాటా స్టీల్ అంతర్జాతీయ చదరంగ పోటీల్లో విజేతగా నిలిచాడు. ఆ తర్వాత బృందంతో కలిసి నెదర్లాండ్స్ నుంచి దుబాయ్ మీదుగా చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రజ్ఞానందకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, ఈ పోటీల్లో విజేతగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. గత యేడాది తన ఆటతీరు సరిగా లేదన్నారు. కానీ, ఇపుడు మొదటి పోటీలోనే గెలుపొందాను. ఇందుకోసం కఠోర శిక్షణ పొందాను. ఈ యేడాది పలు ముఖ్య పోటీలు జరుగనున్నాయన్నారు. అందువల్ల అంచనాలు అధికంగానే ఉన్నాయన్నారు. ఈ టోర్నీలో తన ఆటతీరు సంతృప్తిగానే ఉందన్నారు. ట్రై బేకర్‌లో ఇద్దరం తమిళనాడుకు చెందిన ఆటగాళ్ళే కావడంతో ఎవరు గెలుపొందినా టైటిల్ మనకే వస్తుందని, ఇది ఎంతో గర్వించదగిన విషయమన్నారు.

సచివాలయం వద్ద కొత్త అంబులెన్స్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్





సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ప్రాంతీయ నావికాదళం అధికారి రేర్ అడ్మిరల్ సతీష్ ఎం షెనాయ్

న్యూక్లియోమ్ ఇన్ఫర్మేటిక్స్‌తో ఎస్ఆర్ఐహెచ్ఈఆర్ ఒప్పందం

అడయార్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన న్యూక్లియోమ్ ఇన్ఫర్మేటిక్స్ సంస్థతో పోరూర్‌లోని రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎస్ఆర్ఐహెచ్ఈఆర్) కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇది విద్యార్థులకు జీనోమ్ సీక్వెన్సింగ్‌లో నైపుణ్యం పెంచడానికి దోహదపడనుంది. తక్కువ ఖర్చుతో మెరుగైన క్యాన్సర్ చికిత్స కోసం జన్యు శాస్త్రం, ప్రెసిషన్ మెడిసన్‌పై వినూత్న వ్యూహాలను అభివృద్ధి చేయడంలోనూ ఈ ఒప్పందం ద్వారా ప్రత్యేక దృష్టిసారించనున్నారు. ఈ ఒప్పంద పత్రాలపై న్యూక్లియోమ్ ప్రతినిధి దుష్యంత్ సింగ్ బాఘేల్, ఎస్ఆర్ఐహెచ్ఈఆర్ డీన్ డాక్టర్ కల్పనా బాలకృష్ణన్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లినికల్ రీసెర్చ్ విభాగం అధిపతి డాక్టర్ సాల్మన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న దృశ్యం



'ఒత్త ఓటు ముత్తయ్య' ఆడియో రిలీజ్ దృశ్యం

కోలీవుడ్‌లో 'గౌండమణి' యుగం

● కె.భాగ్యరాజ్

తమిళ చిత్రజ్యోతి

యుగాల్లో నాలుగు యుగాలున్నట్టుగానే తమిళ సినిమాలో ఒకప్పుడు గౌండమణి యుగం ఉండేదని, దాన్ని ఎవరూ మిస్ చేసుకుని ఉండరని సీనియర్ నటుడు, దర్శక నిర్మాత, కథారచయిత కె.భాగ్యరాజ్ అన్నారు. సినీ క్రాఫ్ట్ ప్రొడక్షన్, కుట్టి స్టోరీ పిక్చర్స్ పతాకంపై గౌండమణి కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఒత్త ఓటు ముత్తయ్య'. ఇతర పాత్రల్లో యోగిబాబు, మొట్టై రాజేంద్రన్, సంతాన భారతి, చిత్రా లక్ష్మణన్, సింగముత్తు, బైల్వాన్ రంగనాథన్, సెన్‌రాయన్ తదితరులు నటించారు. ఎంజీ రవిరాజా నిర్మించిన ఈ చిత్రానికి సాయిరాజగోపాల్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ ఆడియో ట్రైలర్ రిలీజ్ మంగళవారం నగరంలో జరిగింది. ముఖ్య అతిథులుగా సీనియర్ దర్శకులు కె.భాగ్యరాజ్, పి.వాసు, సీనియర్ నిర్మాత కె.రాజన్‌తో పాటు చిత్ర బృందం పాల్గొని ఆడియోను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ, 'గౌండమణి తన రూమ్మేట్ అని, సినిమాల్లో తొలి అవకాశం తానే ఇచ్చినా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని, కోలీవుడ్‌లో గౌండమణి యుగాన్ని ఏ ఒక్కరూ మరచిపోలేరని, తాజా చిత్రం ద్వారా గౌండమణికి మళ్ళీ పూర్వవైభవం చేకూరుతుందని ఆశిస్తున్నానన్నారు. నిర్మాత కె.రాజన్ మాట్లాడుతూ, "ఒత్త ఓటు ముత్తయ్య' విక్టరీ ఓటుగా మారుతుంది. సీనియర్ దర్శకుడు పి.వాసు మాట్లాడుతూ, 'గౌండమణితో కలిసి అనేక చిత్రాల విజయోత్సవాల్లో పాల్గొన్నాను. ఇపుడు ఆయన హీరోగా నటించిన చిత్రం ఆడియో రిలీజ్‌కు అతిథిగా రావడం ఎంతో సంతోషంగా ఉంది. శివాజీ గణేశన్, ఇళయరాజా వంటి గొప్ప గొప్ప కళాకారులు కూడా గౌండమణి అభిమానులు. ఇలాంటి అరుదైన భాగ్యం తమిళ సినిమాలో గౌండమణికే దక్కింది. దర్శక నిర్మాతలకు ఎంతో సహకారం అందించే నటుడు. మేనేజర్ కూడా లేకుండా దర్శకులకు ఇచ్చిన డేట్స్ గుర్తుపెట్టుకుని సినిమాల్లో నటించేవారు. నా దర్శకత్వంలో అత్యధికంగా 24 చిత్రాల్లో నటించగా 20 చిత్రాలు ఘన విజయం సాధించాయి. భాష తెలియని వారిని కూడా నవ్వించగల ఏకైక నటుడు గౌండమణి' అన్నారు. 'ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు, ఇందులో నటించిన నటీనటులు, టెక్నీషియన్లకు, ఈ ఆడియో రిలీజ్ వేడుకకు వచ్చిన అతిథులకు గౌండమణి ధన్యవాదాలు తెలిపారు. ఈ 'ఒత్త ఓటు ముత్తయ్య'ను సక్సెస్ మూవీగా చేయాల్సిన బాధ్యత అభిమానులపైనే ఉంది' అన్నారు. ఆ తర్వాత చిత్ర దర్శకుడు సాయి రాజగోపాల్, సంగీత దర్శకుడు సిద్ధార్థ్ విపిన్ తదితరులు ప్రసంగించారు.

బిగ్‌బాస్ ఫేంకు సినిమా ఛాన్స్



'బిగ్ బాస్-6' సీజన్‌తో ఒక్కసారిగా గుర్తింపు పొందిన అయిషాకు సినిమా అవకాశం వరించింది. అనేక టీవీ సీరియల్స్‌తో పాటు వెబ్ సిరీస్‌ఎలో నటించిన ఆమెకు సినిమా ఛాన్స్ వరించింది. ఈ మూవీకి ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. ఆరెంజ్ ప్రొడక్షన్స్ పతాకంపై నూతన దర్శకుడు జాఫర్ రూపొందిస్తున్న ఈ చిత్రంలో 'విడాముయర్చి' గణేష్ శరవణన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఇది కామెడీ థ్రిల్లర్ మూవీ. 2018లో కాలేజీ విద్య పూర్తి చేసిన ప్రేమికులు ఒకానొక సందర్భంగా విడిపోయి. ఇపుడు తమకు నచ్చిన వారిని వివాహం చేసుకుంటారు. ఇలాంటి నేపథ్యంలో వారిద్దరూ మళ్ళీ ఒక చోట కలుసుకుంటారు. ఆ గది తలుపులు అనేకోకుండా లాక్ అవుతాయి. ఆ సమయంలో వారి బంధువులు అక్కడకు చేరుకోగా వారిద్దరూ గది నుంచి బయటకు వస్తే ఏం జరుగుతుందన్న కాన్సెప్టుతో ఈ మూవీని రూపొందించాం' అని వివరించారు.

మార్చి 7న వైభవ్ 'ఆలంబన' విడుదల



ఇప్పటికే పలుమార్లు వాయిదాపడిన 'ఆలంబన' మూవీని మార్చి 7వ తేదీ రిలీజ్ చేయనున్నట్టు తాజాగా ప్రకటించారు. పారి కె.విజయ్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో వైభవ్‌తో పాటు పార్వతి నాయర్, మునీష్‌కాంత్, కాళి వెంకట్, ఆనంద్‌రాజ్, పాండిరాజ్, లియోనీ, రోబో శంకర్ తదితరులు నటించారు. కేజేఆర్ నిర్మాణ సంస్థతో కలిసి కౌస్తుభం మూవీస్ నిర్మించింది. చిన్నారులను అలరించేలా భూతం నేపథ్యంలో నిర్మించారు. ఎపుడో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం 2021లోనే విడుదలకావాల్సి ఉండగా, అనేక సమస్యల్లో చిక్కుకుంది. ఇపుడు ఎట్టకేలకు వచ్చే నెల 7వ తేదీన విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు.

'మై లార్డ్' డబ్బింగ్ షురూ



డబ్బింగ్ చెబుతున్న శశికుమార్

రాజు మురుగన్ దర్శకత్వంలో శశికుమార్, చైత్ర ఆచార్, గురుసోమసుందరం తదితతరులు నటించిన కొత్త చిత్రం 'మై లార్డ్'. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ.. డబ్బింగ్ వేగవంతం చేసింది. ముందుగా, హీరో శశికుమార్ తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేశారు. ఒలింపియా మూవీస్ బ్యానరుపై ఎస్.అంబేద్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి షాన్ రోల్డన్ సంగీత స్వరాలు సమకూర్చారు. 'జపాన్' వంటి డిజాస్టర్ మూవీ తర్వాత రాజు మురుగన్ డైరెక్ట్ చేస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. డబ్బింగ్ పూర్తి చేసి త్వరలోనే విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు.



వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శన

పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టం



ఏడు వాహనాలపై కొండల స్వామి



సర్వభూపాల వాహనం

తిరుమల,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సంబరాలతో మంగళవారం తిరుమల కొండ కిటకిటలాడింది. సప్త వాహన సేవలను తిలకించిన భక్తజనం తన్మయులయ్యారు. వేకువజాము 5.30 గంటలకు వాహన మండపం నుంచి సూర్యప్రభ వాహనంలో విశేష అలంకరణతో మలయప్ప స్వామి బయలుదేరాడు. వాయువ్య మూలలో వేంచేసి సూర్యోదయం కోసం ఎదురు చూశాడు. సరిగ్గా 6.48 గంటలకు రవి కిరణాలు స్వామిని తాకాయి. ఆ క్షణం కోసమే గ్యాలరీల్లో ఎదురు చూసిన భక్తజనం గోవిందనామస్మరణలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఆ తర్వాత ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య చిన్నశేషవాహనం,11-12మధ్య గరుడవాహనం, మధ్యాహ్నం 1-2 మధ్య హనుమంతవాహనం నిర్వహించారు. మధ్యాహ్నం 2-3 మధ్య పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. అంతకుముందు వరాహస్వామి ఆలయం వద్ద చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు. అధికారులతో పాటు భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానాలు ఆచరించారు. తిరిగి సాయంత్రం 4-5 మధ్య కల్పవృక్ష వాహనం, 6-7 మధ్య సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య చంద్రప్రభావాహనసేవలతో ఒక్క రోజు బ్రహ్మోత్సవాలు వేడుకగా ముగిశాయి.



చంద్రప్రభ వాహనం

మాడవీధులు కిటకిట

సోమవారం సాయంత్రం గ్యాలరీల్లోకి భక్తుల ప్రవేశం మొదలైంది. అర్ధరాత్రి ఉత్తరమాఢవీధి పూర్తిస్థాయిలో నిండిపోగా, మంగళవారం వేకువజామునకు పడమర, దక్షిణ, తూర్పు మాడవీధులు, శ్రీవారి ఆలయం ముందు భాగం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎండకు, చలికి ఇబ్బంది లేకుండా మాడవీధుల్లోని గ్యాలరీలపై షెడ్లు వేయడంతో ముందు రోజు సాయంత్రం నుంచీ మంగళవారం రాత్రి దాకా భక్తులు ఒక్కో వాహనాన్ని తిలకిస్తూ కూర్చుండిపోయారు. టీటీడీ అన్నప్రసాదాలు, తాగునీరు అందించడంతో ఇబ్బందిలేకుండా గడిపారు. రాంభగీచ అతిథిగృహాల వద్ద మాత్రం యాత్రికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అక్కడక్కడ గేట్లకు తాళాలు వేయడంతో అగచాట్లు పడ్డారు.

కంగారు పెట్టిన గొడుగు



చిన్నశేష వాహనంలో గొడుగు జారడం అధికారుల్లో కంగారు పుట్టించింది. వాహనమండపం, పుష్కరిణి మధ్యలో వాహనబేరర్లు వాహనాన్ని పైకి, కిందకు ఊపుతూ వేగంగా నడవడంతో ఉత్సవమూర్తికి ఎడమవైపునున్న అర్చకుడి చేతి నుంచి గొడుగు కిందకు జారింది. అయితే వెంటనే అర్చకుడు అప్రమత్తమై గొడుగును పైకి ఎత్తి దాని స్థానంలో ఉంచడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు

రథసప్తమి సందర్భంగా టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేవిధంగా రాబోవురోజుల్లో కూడా ఏర్పాట్లు చేయాలని కోరారు. గ్యాలరీల్లోకి స్వయంగా వెళ్లి ఆరా తీస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని భక్తులు చెప్పారు. ఇంతమంచి ఏర్పాట్లు చేయడంతో పాటు అధికారులు, పోలీసులు, విజిలెన్స్ శ్రీవారిసేవకులు సమర్థంగా విధులు నిర్వహించారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

- బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు చైర్మన్

2.50 లక్షల మంది పాల్గొన్నారు

దాదాపు 2.50 లక్షల మంది భక్తులు పాల్గొని రథసప్తమి వాహన సేవలను వీక్షించారు. సోమవారం రాత్రికే దాదాపు 50 వేల మంది భక్తులు గ్యాలరీల్లోకి వచ్చారు. చాలా మంది ఏర్పాట్లపై మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి సమస్యలు రాలేదు. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తున్నాం. మరుగుదొడ్ల ఏర్పాటుపై కూడా భక్తులు మంచి స్పందన ఇచ్చారు. రథసప్తమి విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉంది.

- శ్యామలరావు, టీటీడీ ఈవో

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి తరగతి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్. శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ఎర్రచందనం కోర్టు లైజన్ అధికారులు చంద్రశేఖరరాజు, రఘు తెలిపిన ప్రకారం.. డక్కిలి మండలం వెలికల్లుకు చెందిన మచ్చల గురునాథం 2012-13లో.. 18 ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తీసుకెళ్లడానికి కయ్యూరు చెరువులో దాచి ఉంచారు. ఈ విషయం తెలిసిన అటవీశాఖ అధికారులు ఆ దుంగలు స్వాధీనం చేసుకుని గురునాథంపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శిరీష వాదనలు వినిపించారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

లా ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో 2024 అక్టోబరులో నిర్వహించిన ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్కూల్స్9, మనబడి వెబ్‌సైట్లలో ఈ ఫలితాల చూడాలని సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎంపీడీవోకు రూ.మూడేసి వేలు

ఎవరెవరు ఇస్తున్నారు?

● అవినీతి ఆరోపణలపై డ్వామా ఏపీడీ విచారణ



ఏపీడీ వరప్రసాద్

పెళ్లకూరు, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల బిల్లుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి నగదు వసూలు చేస్తున్నారన్నారంటూ వచ్చిన ఆరోపణలపై డ్వామా ఏపీడీ వరప్రసాఏద్ విచారణ చేపట్టారు. ఎంపీడీవోపై అవినీతి ఆరోపణలు చేసిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సర్పంచు గుంటపూడి పెంచలయ్య సమక్షంలో మంగళవారం మండల కార్యాలయంలో ప్రమీలారాణిని విచారించారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు చూపాలని మురళీకృష్ణారెడ్డిని ఏపీడీ కోరారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లను బహిరంగంగా విచారించారు. ఎంపీడీవోకు నెలకు రూ.3 వేలు చొప్పున ఎవరెవరు ఇస్తున్నారని ప్రశించగా, తాము ఇవ్వడంలేదని వారు చెప్పారు. విచారణాంశాలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని ఏపీడీ చెప్పారు.

మూడోసారీ.. హరిత పాఠశాల

● నారాయణవనం బాలికోన్నత పాఠశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు



ఢిల్లీలో ఉత్తమ హరిత పాఠశాల అవార్డును అందుకుంటున్న శ్యామలత

నారాయణవనం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని బాలికోన్నత పాఠశాల 2024-25 సంవత్సరానికిగాను మూడోసారి కూడా హరిత పాఠశాలగా ఎంపికై జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినట్టు ప్రధానోపాధ్యాయురాలు శశికళ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన నేషనల్ గ్రీన్ కోర్, సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో ఉత్తమ హరిత పాఠశాల అవార్డును సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీత నరేన్ చేతుల మీదుగా పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ కె.వి.శ్యామలత అందుకున్నారు. పాఠశాలలో వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంత ద్వారా వర్షం నీటి నిల్వ, విద్యార్థుల పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటించడం, పచ్చదనం పెంచడం, విద్యుత్ ఆదా వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హరిత పాఠశాల అవార్డు ఇచ్చారు. ఏపీ ఎన్‌జీసీ డైరెక్టర్ పి.స్రవంతి, డీఈవో కేవీఎస్ కుమార్, డీవైఈవో ప్రభాకర్ రాజు, ఏపీ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ తదితరులు ఉపాధ్యాయులను అభినందించారు.

బందోబస్తు సిబ్బందికి ధన్యవాదాలు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి అనంతపురం రేంజ్ డీఐజీ షేమోషీ, ఎస్పీ హర్షవర్ధనరాజు శుక్రవారం రాత్రి ఓ ప్రకటన ద్వారా ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 1,400 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాహనసేవలు జరిగాయని పేర్కొన్నారు. యాంటీ సబటేజ్ చెక్, ఫ్రిస్కింగ్, క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ నియంత్రణ వంటి చర్యలు చేపట్టామన్నారు. విజిలెన్స్‌తో సమన్వయం చేసుకుని చిన్నఘటన కూడా లేకుండా చర్యలు చేపట్టామన్నారు.